నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 26 డిసెంబర్ 2023 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## ప్రజాసేవే లక్ష్యం
### మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప


కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

దహెగాం, డిసెంబర్ 25 : ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతామని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో ఓడినా.. గెలిచినా ప్రజలకు సేవ చేస్తామన్నారు. కార్యకర్తలెవ్వరూ అధైర్యపడవద్దని, అందరికీ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపల్లి శ్రీరామారవు, రైతుబంధు మండల కన్వీనర్ కంభగౌని సంతోష్‌గౌడ్, సర్పంచ్‌లు బండ కృష్ణమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్‌రాజ్ పాల్గొన్నారు.

## పడి పూజకు రూ. 50 వేలు అందజేత


మహా మండల పడి పూజ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 25 : జిల్లా కేంద్రంలోని పెద్దవాగు తీరంలోగల అయ్యప్ప స్వామి ఆలయంలో ఈ నెల 27న నిర్వహించే మహా మండల పూజకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆవిష్కరించారు. గురువారం జరిగే అన్నదాన కార్యక్రమానికి ఆమె తనవంతుగా రూ. 50 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, గురుస్వాములు నలిని మోహన్, వేణుగోపాల్, చిట్టి మల్ల సంతోష్, బట్టుపల్లి సంతోష్, దూడల అశోక్, శ్యామ్ రావు, బాల రాము, చంద్రమోహన్, స్వాములు ఐలవేణి సంతోష్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

# కార్మిక పక్షం.. టీబీజీకేఎస్

## సింగరేణి చరిత్రలో లేని విధంగా హక్కులు సాధించిన ఘనత

- కేసీఆర్ సర్కారు సాయంతో కార్మికులకు అనేక ప్రయోజనాలు
- మరోసారి గెలిచేందుకు ఉవ్విళ్లూరుతున్న బీఆర్ఎస్ అనుబంధ సంఘం
- హ్యాట్రిక్‌కే లక్ష్యంగా ముందుకు..
- ఆఖరి రోజు జోరుగా ప్రచారం
- బాణం గుర్తుకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి



*టీబీజీకేఎస్.. సింగరేణి ప్రగతిలో కీలకపాత్ర పోషించడమేగాక అనేక హక్కులు సాధించి నల్లసూర్యుల మనసు గెలుచుకున్నది. ఇప్పటికే 'గుర్తింపు' ఎన్నికల్లో రెండుసార్లు విజయం సాధించగా, ముచ్చటగా మూడోసారి గెలిచే లక్ష్యంతో ముందుకెళ్తున్నది. వారసత్వ ఉద్యోగాలు పోగొట్టిన జాతీయ సంఘాల వైఖరిని ఎండగడుతూనే.. తాము సాధించిన ఘనతను వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నది. గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సారథ్యంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, సౌకర్యాలే తిరిగి గెలిపిస్తాయన్న ధీమా నాయకుల్లో వ్యక్తమవుతున్నది. ఇక ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు చేసిందేమీ లేదని, తమను కంటికి రెప్పలా కాపాడుకున్న బీఆర్ఎస్ అనుబంధ సంఘాన్నే గెలిపించుకుంటామని కార్మిక లోకం స్పష్టం చేస్తున్నది.*

శ్రీరాంపూర్, డిసెంబర్ 25 : తెలంగాణ బొగ్గు కార్మిక సంఘం.. సింగరేణి చరిత్రలో లేని విధంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడమేగాక లెక్కకు మించి హక్కులు సాధించి కార్మికుల మనసును గెలుచుకున్నది. కేసీఆర్ సర్కారు ప్రోత్సాహం, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సారథ్యంలో సంస్థ ప్రగతికి కృషి చేయడమేగాక కార్మికుల పక్షాన నిలిచి అనేక ప్రయోజనాలు సాధించింది. కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకొని ఒక్క పోరాటమైనా లేకుండా దేశ చరిత్రలో ఏ ప్రభుత్వ రంగ సంస్థ సాధించని అభివృద్ధి సాధించింది. నూతన హక్కులతో పాటు జాతీయ కార్మిక సంఘాలు పోగొట్టిన హక్కులను కూడా సాధించి కార్మికుల గుండెల్లో గూడు కట్టుకున్నది.

### ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ చేసిందేమిటి?

1998, 2001లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన ఏఐటీయూసీ ఎలాంటి హక్కులు, ప్రయోజనాలు కల్పించిందో కార్మిక వర్గానికి తెలుసు. అందుకే 2003లో జరిగిన ఎన్నికల్లో ఆ సంఘాన్ని ఓడించి.. ఐఎన్‌టీయూసీకి పట్టం కట్టారు. ఐఎన్‌టీయూసీతోనైనా తమకు లాభం జరుగుతుందేమోనని ఆశించిన కార్మిక లోకానికి చివరికి నిరాశే మిగిలింది. ఇలా ఏఐటీయూసీ కాకపోతే.. ఐఎన్‌టీయూసీ.. ఐఎన్‌టీయూసీ కాకపోతే.. ఏఐటీయూసీ గెలుచుకుంటూ వచ్చాయి. 12 ఏళ్లు గుర్తింపు కార్మిక సంఘాలుగా ఉండి కార్మికులకు చేసిందేమీ లేకపోగా.. వారసత్వ ఉద్యోగాలు ఊడగొట్టింది. ఈ విషయాన్ని కార్మిక కుటుంబాలు ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నాయి. అలాంటి వారికి ఓట్లు అడిగే హక్కు లేదని, ఈ ఎన్నికల్లోనూ టీబీజీకేఎస్‌కే పట్టం కట్టి.. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు.

### హ్యాట్రిక్‌పై టీబీజీకేఎస్ దృష్టి..

2012 అక్టోబర్ 5న.. జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మిక వర్గం టీబీజీకేఎస్‌ను ఆదరించింది. 23,311 ఓట్లు అందించి గుర్తింపు కార్మిక సంఘంగా టీబీజీకేఎస్‌ను నిలబెట్టింది. కేసీఆర్ సర్కారు సహకారంతో సింగరేణి చరిత్రలో లేనివిధంగా అనేక హక్కులు సాధించి కార్మికుల చేత ప్రశంసలు అందుకున్నది. 2017లో జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లోనూ విజయం సాధించింది. 23,845 ఓట్లు సాధించింది. కార్మికులు గత ఎన్నికలకంటే 534 ఎక్కువ ఓట్లతో గెలిపించారు. ఇక ఈ నెల 27న నిర్వహించనున్న గుర్తింపు ఎన్నికల్లోనూ మరోసారి గెలిచేందుకు టీబీజీకేఎస్ ఉవ్విళ్లూరుతున్నది. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కవిత సూచనలతో నాయకులు హ్యాట్రిక్ సాధించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నారు.

### ఆఖరి రోజు టీబీజీకేఎస్ జోరు

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రచారం సోమవారంతో ముగిసింది. పక్షం రోజులుగా శ్రీరాంపూర్ ఏరియాలోని గనులు, ఓసీపీలపై బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ నాయకులు విస్తృత ప్రచారం చేశారు. ఆఖరి రోజు శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 5, 6, 7, వర్క్‌షాప్‌లో సోమవారం టీబీజీకేఎస్ నాయకులు జోరుగా ప్రచారం చేశారు. టీబీజీకేస్ ఏరియా చర్చల ప్రతినిధి పెట్టం లక్ష్మణ్, మాజీ ఉపాధ్యక్షుడు బండి రమేశ్, బ్రాంచ్ కార్యదర్శి పానగంటి సత్తయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి తొంగల రమేశ్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి సాదుల భాస్కర్, వెంకట్‌రెడ్డి, మల్లేశ్, రాజునాయక్, ప్రసాద్, పవన్, లాల్‌లు గనులపై తిరిగి బాణం గుర్తుకు ఓటు వేసి గెలపించాలని కోరారు. సింగరేణి కార్మికులకు కేసీఆర్ సర్కారు 20 వేల ఉద్యోగాలు కల్పించిందని, యువ కార్మికులు టీబీజీకేఎస్‌ను గెలిపించి కేసీఆర్‌కు కృతజ్ఞత చాటు కోవాలని కోరారు. హక్కులు సాధించిన టీబీజీకేఎస్ కావాల్నో.. ఉన్న హక్కులు పోగొట్టిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ కావాల్నో నిర్ణయించుకోవాలని సూచించారు. వికాస్, గోనె స్వామి, గరిగె చేరాలు, సతీష్, ప్రశాంత్, రాజయ్య, ఉత్తేజ్‌రెడ్డి, హరీశ్ పాల్గొన్నారు. ఇక శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 7, 7ఏ, ఏరియా వర్క్‌షాప్‌పై మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు, కలవేణ శ్యాంకుమార్ ప్రచారం నిర్వహించారు. అలాగే ఆర్కే-5గనిపై కేంద్ర నాయకులు కే సురేందర్‌రెడ్డి, ప్రచారం చేశారు. ఐఎన్‌టీయూసీ నాయకులు గరిగె స్వామి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. సోమవారం ఆర్కే 7గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య మాట్లాడారు. నాయకులు రాజేంద్రప్రసాద్, అశోక్, నవీన్, నర్సయ్య, బాలయ్య, రమేశ్, శ్రీనివాస్, తుల అనిల్, వెంకటస్వామి పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 5గనిపై బీఎంఎస్ జాతీయ బొగ్గు గనుల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి ప్రచారం చేశారు. బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, బ్రాంచ్ కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు నాగేశ్వర్‌రావు, తిరుపతి, రమేశ్, గూడ శ్రీకాంత్‌రెడ్డి, వంశీకృష్ణ, రాజు, మహేశ్, రాజేంద్ర, పోతరాజు పాల్గొన్నారు. కాగా, ఎన్నికల్లో గెలుపొందేందుకు కొన్ని సంఘాలు డబ్బులు, మద్యం పంపిణీ చేస్తూ కార్మికులను ప్రలోభాలకు గురిచేయడం మొదలు పెట్టాయి. కార్మిక వర్గానికి కేసీఆర్ ప్రభుత్వం సాధించి పెట్టిన కారుణ్య ఉద్యోగాలు, చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, సౌకర్యాలే తిరిగి టీబీజీకేఎస్‌ను గెలిపిస్తాయని ఆ సంఘం నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

### టీబీజీకేఎస్ గెలిస్తే ..

- కార్మికులకు సొంతింటి కల
- గృహ రుణాలు రూ. 20 లక్షలకు పెంపు
- అలవెన్స్‌లపై ఐటీ రద్దుకు హామీ
- డిపెండెంట్ ఉద్యోగానికి వయసు పరిమితి 35 నుంచి 40కు పెంపు.
- కార్మికుల పేర్లలో తప్పుల సవరణ
- విజిలెన్స్ వల్ల పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్లకు నిర్ణీత సమయంలో ఉద్యోగాలు
- కేంద్ర ప్రభుత్వ బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకం
- సింగరేణి ఆధ్వర్యంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్ల ఏర్పాటు
- సింగరేణి కార్మికుల నివాసాలకు రక్షిత మంచినీటి (ఆర్ఓ)ప్లాంట్ల దారా సరఫరా
- బొగ్గు గనుల వేలంలో సింగరేణి యాజమాన్యం కూడా పాల్గొనేలా కృషి
- ప్లేడే పీహెచ్‌డీ విషయంలో ఎన్-1 విధానం రద్దు
- మైనింగ్ స్టాఫ్, ఈఅండ్ఎం సూపర్‌వైజర్స్, ట్రేడ్స్‌మెన్, ఈపీ ఆపరేటర్స్, ఎంవీ డ్రైవర్స్, మెడికల్ అన్‌ఫిట్ అయితే వారికి సర్ఫేస్‌లో సూటబుల్ ఉద్యోగం.


ఎస్సార్పీ- 3 గనిపై ప్రచారం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

### టీబీజీకేఎస్ సాధించిన హక్కులు

- జాతీయ కార్మిక సంఘాలు కాలరాసిన వారసత్వపు ఉద్యోగాల హక్కును కారుణ్యం ద్వారా తీసుకువచ్చింది. 16,000 మందికి ఉద్యోగాలిప్పించింది.
- పెండింగ్‌లో ఉన్న 600 మంది డిపెండెంట్‌లకు తిరిగి ఉద్యోగాలు. ● ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ల ద్వారా 4200 మందికి కొత్తగా ఉద్యోగాలు. ● 600 మంది డిస్మిస్డ్ కార్మికులకు తిరిగి ఉద్యోగాలు. ● వికలాంగులకు సర్ఫేస్ ఉద్యోగాలు. ●లాభాల వాటా 16 శాతం నుంచి 32 శాతానికి పెంపు. సకలజనుల సమ్మె కాలపు వేతనం పంపిణీ.
- తెలంగాణ ఇంక్రిమెంట్ ● కార్మిక కుటుంబాలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం, రూ.10 లక్షల గృహ రుణం, వడ్డీ చెల్లింపు.
- ఉద్యోగం వద్దనుకుంటే డిపెండెంట్‌లకు రూ. 25 లక్షల చెల్లింపు (కోలిండియాలో లేదు) ● ఐఐటీ, ఐఐఎంలలో సీటు సాధించిన కార్మికుల పిల్లలకు ట్యూషన్ ఫీజు, రీయింబర్స్‌మెంట్. ● సొంత ఇల్లు ఉండే కార్మికులకు 100 యూనిట్ల విద్యుత్ చార్జీల చెల్లింపు.
- కార్మికుల కమ్యూనిటీ హాళ్లకు ఏసీ సౌకర్యం
- గని ప్రమాదంలో మరణించిన కార్మిక కుటుంబానికి రూ. 20 లక్షల మ్యాచింగ్ గ్రాంట్.
- విధులు, డ్యూటీలో సహజ మరణం పొందిన కార్మిక కుటుంబానికి రూ.20 లక్షల మ్యాచింగ్ గ్రాంట్.
- రూ. 175 కోట్ల వృత్తి పన్ను బకాయిలు పర్మినెంటుగా రద్దు.
- మహిళలకు ప్రసూతి సెలవులు ● పీఎంఈ మస్టర్ కల్పన.
- కోలిండియాలో లేనివిధంగా సింగరేణిలో మహిళలకు డిపెండెంట్ ఉద్యోగాల్లో అవకాశం ● పెళ్లయిన, విడాకులైన, వితంతువు, ఒంటరి మహిళ కూతురు, వితంతువు కోడలుకు కూడా డిపెండెంట్ ఉద్యోగాలకు అవకాశం.
- మహిళా కార్మికులకు చైల్డ్ కేర్ లీవ్ రెండేళ్లు.
- సింగరేణి కార్మికుల ఆరోగ్యం, పిల్లల భవిష్యత్తు కోసం రామగుండంలో సింగరేణి మెడికల్ కళాశాల ఏర్పాటు. కార్మికుల పిల్లలకు 5 శాతం రిజర్వేషన్.
- సింగరేణి ఏరియా ఆసుపత్రి, కొత్తగూడెం కార్పొరేట్ ఆసుపత్రిలో సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ ఏర్పాటు.
- 2014 మార్చి 31 వరకు వేచి ఉన్న 3200 మంది డిపెండెంటులందరికీ ఒకేసారి ఉద్యోగాలు
- బేసిక్‌పై 1 శాతం విద్యుత్ చార్జీలు రద్దు చేసి ఏసీ పెట్టుకోవడానికి అనుమతి, ఉచిత విద్యుత్.
- 190/240 మస్టర్‌లు నిండిన సంవత్సరంలోపే బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్‌గా క్రమబద్ధీకరణ.
- సంస్థలో ఇక ముందు డబుల్ బెడ్‌రూమ్ క్వార్టర్స్ నిర్మించాలని నిర్ణయం. భూపాలపల్లిలో 994, సత్తుపల్లిలో 440 డబుల్ బెడ్ రూమ్ క్వార్టర్ల నిర్మాణం.
- సింగరేణి వ్యాప్తంగా ఏసీ ఫంక్షన్ హాళ్ల ఏర్పాటు.
- తెలంగాణ సకలజనుల సమ్మె కాలపు వేతనాలు, ఇంక్రిమెంట్‌ల అందజేత.


కౌటాల : క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

# హ్యాపీ క్రిస్మస్

- జిల్లాల్లో ఘనంగా వేడుకలు
- చర్చిల్లో క్రైస్తవుల ప్రార్థనలు, బైబిల్ పఠనం
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- అలరించిన సాంస్కృతి కార్యక్రమాలు


ఆసిఫాబాద్ టౌన్ :చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**కరుణామయుడు, శాంతిదూత** యేసుక్రీస్తు జన్మదినం సందర్భంగా సోమవారం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు పెద్ద సంఖ్యలో చర్చిలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేయగా, పాస్టర్లు దైవ సందేశాన్ని అందించారు. హ్యాపీ క్రిస్మస్.. మేరీ మేరీ క్రిస్మస్.. అంటూ క్రీస్తును స్తుతిస్తూ గీతాలు ఆలపించారు. కేక్‌లు కట్ చేసి.. మిఠాయిలు పంపిణీ చేశారు. ఆయా చోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.


మంచిర్యాల ఏసీసీ : కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, యువ నాయకులు విజిత్ రావు

# అంపశయ్యపై కొయ్య బొమ్మ


నిర్మల్ కొయ్య బొమ్మలు

## సంక్షోభంలో పరిశ్రమ.. గందరగోళంలో కళాకారులు..

- కరువైన ప్రోత్సాహం.. పట్టించుకోని బీజేపీ ప్రభుత్వం..
- ఐదారేండ్లుగా తరిగిపోతున్న 'పొనికి' కర్ర నిల్వలు
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ప్లాంటేషన్‌కు చర్యలు
- తాజాగా ప్రధానమంత్రి మోదీ హామీ ఇచ్చినా నెరవేరని వైనం
- ఎగుమతులపై కార్యాచరణ కరువు

నిర్మల్, డిసెంబర్ 25(నమస్తే తెలంగాణ) : ప్రపంచ ప్రసిద్ధిగాంచిన నిర్మల్ కొయ్య బొమ్మల పరిశ్రమ అంపశయ్యపైకి చేరింది. బొమ్మలు తయారు చేయడానికి అవసరమైన ప్రధాన ముడిసరుకు పొనికి కర్ర దొరకడం లేదు. ఫలితంగా దీనిపై ఆధారపడ్డ దాదాపు 200 కుటుంబాల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారింది. పదేండ్ల నుంచి కేంద్రంలోని బీజేపీ సర్కారును ఆదుకోవాలని వేడుకున్నా.. ఎగుమతుల విషయంలో రాయితీలు, ఇతర ప్రోత్సాహకాలు అందించాలని విన్నవించినా పట్టించుకోవడం లేదు. గత కేసీఆర్ ప్రభుత్వం సహకారం అందించినా.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం ఆదుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వం కూడా పలుమార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసినా.. బీజేపీ పెద్దలు కనికరించక పోవడంతో పరిశ్రమ అంపశయ్యపైకి చేరుకున్నది.

### పూర్వవైభవం తీసుకొస్తామని మోదీ హామీ

తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిర్మల్ జిల్లా కేంద్రానికి బీజేపీ ప్రచారానికి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొయ్య బొమ్మల పరిశ్రమను ఆదుకుంటామని, పూర్వ వైభవం తీసుకొస్తామని, కళాకారులందరికీ జీవనోపాధి మెరుగుపరుస్తామని బహిరంగ సభా వేదికపై ప్రకటించారు. అంతేకాకుండా అప్పటి రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోలేదంటూ విమర్శలు గుప్పించారు. తాము ఎన్నికలు ముగియగానే ఆదుకొని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అయితే ఎన్నికలై నెల రోజులు గడిచినా హామీలు నెరవేర్చక పోవడం విమర్శలకు తావిస్తున్నది. పరిశ్రమను ఆదుకునేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కారు పకడ్బందీ కార్యాచరణను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నిర్మల్‌లో కొయ్య బొమ్మల పరిశ్రమ భవనం

### మోదీ హామీకి రూపులేదు..



*రాబోయే రోజుల్లో ఈ కళ ముందు తరాలకు వెళ్లాలంటే పొనికి చెట్లను బాగా పెంచాలి. కేంద్ర ప్రభుత్వం అటవీ అనుమతులను కూడా సులభతరంగా ఇవ్వాలి. మొన్నటి ఎన్నికల ప్రచారానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిర్మల్ వచ్చినప్పుడు కొయ్య బొమ్మల పరిశ్రమను ఆదుకుంటామన్నారు. ఇప్పటి వరకైతే ఎలాంటి స్పందన లేదు.* **- శ్రీనివాస్, కొయ్య బొమ్మల కళాకారుడు, నిర్మల్.**

### తరిగిపోతున్న 'పొనికి' నిల్వలు

పొనికి కర్ర కొరత కారణంగా ఐదారేళ్లుగా పరిశ్రమ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఇక్కడి అటవీ ప్రాంతంలో ప్లాంటేషన్ నిరంతరాయంగా జరగక పోవడం, చెట్లు కనుమరుగై పోవడంతో కలప లభ్యత కష్టంగా మారింది. మొన్నటి వరకు అటవీ శాఖ ఆధ్వర్యంలోని టింబర్ డిపోల్లో పొనికి నిల్వలను కొనుగోలు చేసి బొమ్మలు తయారు చేసేవారు. డిపోల్లో నిల్వలు తగ్గిపోవడంతో పొరుగు జిల్లాలతోపాటు, సరిహద్దు రాష్ట్రాల్లో కూడా అన్వేషిస్తున్నారు. ఇలాంటి పరిణామాల నేపథ్యంలోనే కొయ్య బొమ్మల మనుగడ ప్రశ్నార్థకమవుతున్నది. పరిశ్రమ ఉనికికి ముప్పు తప్పదని భావించిన కేసీఆర్ ప్రభుత్వం ఊరటనిచ్చే చర్యలు చేపట్టింది. హరితహారం పథకంలో భాగంగా పొనికి మొక్కల ప్లాంటేషన్‌ను పెద్ద ఎత్తున చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. మొక్కల పెంపకానికి అనువైన ప్రాంతాలుగా మామడ మండలంలోని కొరిటికల్, గాయిద్‌పెల్లి, వాస్తాపూర్, లింగాపూర్, తోటిగూడ గ్రామాలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేసింది. మొదట లింగాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో హరితహారం కింద 1000 పొనికి మొక్కలు నాటారు. అలాగే వాస్తాపూర్, గాయిద్‌పెల్లి గ్రామాల్లో దశలవారీగా పెంపకాన్ని చేపట్టాలని నిర్ణయించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి పరిశ్రమను ఆదుకునే చర్యలు చేపట్టాలని కళాకారులు కోరుతున్నారు.

## మార్గశిర పౌర్ణమికి గూడెం ముస్తాబు

దండేపల్లి, డిసెంబర్ 25 : దండేపల్లి మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో నేడు నిర్వహించనున్న మార్గశిర పౌర్ణమి జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సత్యదేవున్ని ముస్తాబు చేశారు. ప్రతి పౌర్ణమి మాదిరిగానే ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, హైదరాబాద్ జిల్లాల నుంచి వేలాదిగా తరలిరానున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో 800 మందికి ఉచితంగా అన్నదానం చేయనున్నట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

### భక్తుల సందడి

గూడెం రమాసహిత ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. మార్గశిర పౌర్ణమికి ఒకరోజు ముందు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.


ముస్తాబైన స్వామివారు

## వైభవంగా శివాలయ వార్షికోత్సవం


పూజలందుకుంటున్న శివయ్య

కౌటాల, డిసెంబర్ 25 : మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయ 50వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు అంబేద శంకరయ్య, అంబేద సంతోష్ ఆధ్వర్యంలో శివుని ఆరాధన, హారతి, అఖండ దీపారాధన, గణపతి పూజ, ధ్వజారోహణ, మహా గణపతి హోమం, వీరభద్ర పూజలు, లక్ష దీపోత్సవం, మహారుద్ర హోమ హారతి, అగ్ని గుండ భూమి పూజ, అగ్ని గుండ ప్రజ్వలన, ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ శైలం మల్లికార్జున స్వామి ఆలయం నుంచి వచ్చిన వేద పండితుల మంత్రోచ్ఛరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అదనపు ఎస్పీ సిలువేరు అచ్చేశ్వర్‌రావు పాల్గొన్నారు.